TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 106 | శుక్రవారం, ఆగస్టు 16, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

### రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన

## సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే రైతు భరోసా పథకం ప్రారంభించనున్నట్లు సిఎం చెప్పారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా సిఎం రేవంత్.. పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు రెండో పంప్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎం రేవంత్ తోపాటు మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిఎం రేవంత్ రెడ్డి.. ఎన్నికల ముందు చెప్పినట్లు వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా రుణమాఫీ చేస్తున్నామన్నారు. రుణమాఫీ అసాధ్యమని కొందరు చెప్పారని.. కానీ, రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసి చూపిస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచి ఫసల్‌బీమాలో చేరాలని నిర్ణయించామని సిఎం రేవంత్ చెప్పారు.

### కోల్‌కతా డాక్టర్‌పై... ------------------------

## సామూహిక అత్యాచారం

కోల్‌కత: కోల్‌కతలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో హత్యకు గురైన 31 సంవత్సరాల పోస్టు గ్రాడ్యుయేట్ ట్రెయినీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం జరిగినట్లు పోస్టు మార్టమ్ నివేదిక సూచిస్తోందని ప్రభుత్వ వైద్యుల సంఘం అఖిల భారత సమాఖ్య అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబర్ణ గోస్వామి వెల్లడించారు. ట్రెయినీ డాక్టర్ శరీరంపై ఉన్న గాయాలను బట్టి అవి ఒక వ్యక్తి వల్ల అయ్యేవి కావని అర్థమవుతుందని ఆయన చెప్పారు. మృతురాలి మర్మాంగంలో 151 గ్రాముల వీర్యం లభించినట్లు పోస్టు మార్టమ్ నివేదిక వెల్లడించిందని, అయితే అంత ఎక్కువ పరిమాణంలో వీర్యం ఒక వ్యక్తికి చెందినది ఉండదని డాక్టర్ గోస్వామి ఒక ఆంగ్ల చానల్‌తో మాట్లాడుతూ తెలిపారు. దీన్నిబట్టి చూస్తే ఈ హత్యాచారంలో ఒకరి కన్నా ఎక్కువ మంది ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ అమానవీయ ఘటన వెనుక చాలామంది పాత్ర ఉండవచ్చని బాధితురాలి కుటుంబ సభ్యులు కూడా అనుమానం వ్యక్తం చేశారని ఆయన గుర్తు చేశారు.

బాధితురాలి శరీరంపై ఉన్న గాయాలు, జరిగిన బల ప్రయోగం ఒక వ్యక్తి చేసిన పని కాదని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కెజి కర్ ఆసుపత్రిలోని సెమినార్ హాలులో శుక్రవారం ఉదయం అర్ధనగ్న స్థితిలో ట్రెయినీ డాక్టర్ మృతదేహం లభించింది. ఈ కేసుకు సంబంధించి కోల్‌కత పోలీసుకు చెందిన మున్సిపల్ వాలంటీర్ సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలిని గొంతు నులిమి చంపివేసినట్లు పోస్టు మార్టమ్ నివేదిక నిర్ధారిస్తోంది. గొంతు నులమడంతో ఆమె థైరాయిడ్ కార్టిలేజ్ విరిగిపోయింది.




### హరీశ్ రావుకు

## సిఎం రేవంత్ రెడ్డి సవాల్



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు సవాల్ విసిరారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని సిఎం అన్నారు. ఖమ్మం జిల్లాలో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తే సిద్దిపేట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్‌రావు సవాల్ చేశారు. రుణమాఫీ అమలు చేశాం.. హరీశ్‌రావు రాజీనామా చేయాలి.. లేదంటే తెలంగాణ రైతాంగానికి క్షమాపణ చెప్పాలి. అమర వీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాయాలి. తాను విసిరిన సవాల్‌ను వెనక్కి తీసుకుంటున్నట్టు హరీశ్‌రావు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ ఫైరయ్యారు. 8 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై, తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై, 10ఏళ్ల బీఆర్ఎస్ పాలనపై చర్చకు తాము సిద్ధమని సిఎం రేవంత్ అన్నారు. "ఎక్కడ చర్చ పెడుదామో చెప్పు.. కాంగ్రెస్ ప్రభుత్వం తరుపున మా మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు వస్తారు.. దమ్మంటే, చర్చకు నువ్వొస్తవో లేక, మీ మామ, బామ్మర్ది వస్తడో రండి" అంటూ హరీశ్ రావుకు సిఎం రేవంత్ సవాల్ విసిరారు.

### ఆకట్టుకుంటున్న పవన్, ఆద్య...


## సెల్ఫీ ఫోటో

**కాకినాడ: తన కూతురు ఆద్యతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీసుకున్న సెల్ఫీ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గురువారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సీఎం హెూదాలో తొలిసారి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ వేడుకలో పవన్ కూతురు ఆద్య కూడా పాల్గొంది. ఈ సందర్భంగా స్టేజీపై కూతురుతో పవన్ సెల్ఫీ తీసుకున్నారు. ఈ ఫోటోను రేణూ దేశాయ్ సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "తన తండ్రి, ఏపీ డిప్యూటీ సీఎం సేవలను అర్థం చేసుకున్న ఆద్య ఆయన్ను ప్రశంసించింది. 'నాన్నతో కలిసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొంటానని' ఆద్య అడగ్గానే సంతోషించా" అని పేర్కొంది. కాగా.. కూతురుతో పవన్ తీసుకున్న సెల్ఫీ ఫోటో అభిమానులు ఆకట్టుకుంటోంది.**



### దాంతో ఆర్థిక వ్యవస్థలో పెను...


## మార్పు తీసుకొస్తాం



ఢిల్లీ: భారత దేశ ప్రజల కలు సాకారమయ్యే రోజు ఎంతో దూరంలో లేదని ప్రధాని మోడీ తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యమని స్పష్టం చేశారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు. వికసిత్ భారత్ 2047 నినాదం తమది అని, 140 కోట్ల మంది కలల తీర్మానం అని పేర్కొన్నారు. భారత్ ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలన్నారు. తయారీ రంగంలో గ్లోబల్ హబ్ గా భారత్ ను మార్చాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ప్రధాని నరేంద్ర మోడీ ఎగురవేశారు. రక్షక దళాల గౌరవ వందనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ స్వీకరించారు. అనంతరం మోడీ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. కోటి మంది మహిళలను లక్షాధికారులుగా మారుస్తామని తెలిపారు. మరో పది కోట్ల మంది మహిళలు కొత్తగా స్వయం సహాయక సంఘాల్లో చేరుస్తామని హామీ ఇచ్చారు. అంతరిక్షంలో భారత్ స్పేస్ స్టేషన్ త్వరలో సాకారం కావాలని ఆకాంక్షించారు. అంతరిక్ష రంగంలో భారత్ బలమైన శక్తిగా ఎదిగిందని, అంతరిక్ష రంగంలో వందలకొద్దీ స్టార్టప్ లు వచ్చాయని, ప్రైవేటు ఉప గ్రహాలు, రాకెట్లు ప్రయోగిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోడీ కొనియాడారు. మౌలిక సదుపాయాల్లో పెను మార్పులు తీసుకొచ్చామని, దేశ హితానికే తొలి ప్రాధాన్యత ఇస్తామని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని కోరారు. ప్రపంచానికే అన్నం పెట్టే స్థాయికి భారత్ ఎదగాలని, దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరం ఉందని, న్యాయ వ్యవస్థలో సంస్కరణలు అవసరం ఉందని తెలియజేశారు. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలని, వోకల్ పర్ లోకల్ అనే నినాదంతో ఆర్థిక వ్యవస్థలో పెను మార్పు తీసుకోస్తామని మోడీ తెలియజేశారు. సర్జికల్ స్ట్రైక్స్ ను దేశం ప్రజలు సగర్వంగా స్మరించుకుంటున్నారని గుర్తు చేశారు. అభివృద్ధిని బ్లూప్రింట్ గా సంస్కరణలు తీసుకొస్తున్నామని చెప్పారు.


## రూ.2 లక్షల వరకు రుణమాఫీ

### మూడో విడత నిధులు విడుదల చేసిన రేవంత్



హైదరాబాద్: మూడో విడత రైతు రుణమాఫీ నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. గురువారం ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సిఎం రేవంత్ మూడో విడత నిధులను విడుదల చేశారు. దీంతో 2 లక్షల రూపాయల వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ కానుంది. రేపు రైతుల ఖాతాలో నిధులు జమ కానున్నాయి. మూడో విడతలో మొత్తం 14.4 లక్షల మంది రైతులకు లాభం చేకూరనుంది. ఆగస్టు 15వ తేదీ నాటి వరకు రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చామని.. మాట ప్రకారం రుణమాఫీ చేశామని సిఎం రేవంత్ అన్నారు. రూ.31వేల కోట్లతో జూలై 18 నుంచి నేటి వరకు రైతు రుణాలను మాఫీ కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసి చూపించామని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు రాజీనామా చేయాలని.. లేకపోతే, ముక్కు నేలకు రాసి, తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని సిఎం అన్నారు.

# బాసర అమ్మవారి ఆలయంలో చోరీ



**బాసర:** ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో చోరీ కలకలం రేపుతుంది. రాత్రి 10.30 గంటల సమయంలో దుండగుడు అమ్మవారి ఆలయంలో ప్రవేశించి హుండీలను పగలగొట్టి చోరీలకు పాల్పడ్డాడు. అనంతరం అక్కడే ఉన్న ప్రధాన హుండీని తెరవడానికి శతవిధాల ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. చోరీ చేస్తున్న దృశ్యాలు అన్ని సిసి కెమెరాలో రికార్డు అయింది. అంతకు ముందు దొంగ హోంగార్డుల కళ్లు కప్పి లడ్డు పులిహోర టికెట్ కౌంటర్‌ను పగలగొట్టి కౌంటర్‌లోని నగదు దోచుకున్నాడు. అనంతరం తాపీగా గోశాల నుండి ఇనుప కంచెను తొలగించి గోపురంపై నుండి ఆలయంలోకి 10.30 ప్రాంతంలో ప్రవేశించాడు. అమ్మవారి ఆలయంలోని ఉపఆలయం దత్తాత్రేయ ఆలయం ముందర హుండీని పగలగొట్టి నగదును దోచుకెళ్లినట్టు తెలుస్తోంది. అనంతరం మహంకాళి ఆలయం ముందర ఉన్న కౌంటర్‌ను తెరిచి వస్తువులను చిందవందర చేశాడు. ఆగంతకుడు సుమారు ఆలయంలో గంటకు పైగా భద్రతా సిబ్బంది కళ్లు కప్పి చోరీ చేస్తున్నా పసిగట్టలేకపోవడంపై తీవ్ర అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. పోలీసులు ఫింగర్ ప్రింట్, డాగ్‌స్కాడ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. అమ్మవారి ఆలయంలో చోరీ జరిగిన ఆలయాన్ని బైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్,ముథోల్ సీఐ మల్లేష్, ఆలయ ఈవో విజయరామారావు పరిశీలించారు.

## మాట నిలుపుకున్నాం...

# సిగ్గు, శరం ఉంటే రాజీనామా చేయ్



వైరా : ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు నేడు రెండు లక్షల రుణమాఫీ చేశామని అంటూ చీము నెత్తురు, సిగ్గ శరం ఉంటే హరీశ్ రావు తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్యాలని డిమాండ్ చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. వైరాలో జరిగిన ఒక కార్యక్రమంలో రేవంత్ మూడో విడత రుణ మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేశామని చెప్పారు. రాహుల్ ఇచ్చిన మాట ప్రకారం 2లక్షల రుణమాఫీ చేశామన్నారు రేవంత్. ఇవాళ ఒక రోజే 18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. దేశంలో ఇంత పెద్ద మొత్తం రుణమాఫీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 140 కోట్ల మంది స్వేచ్ఛావాయువులు పీల్చే విధంగా కాంగ్రెస్ స్వాతంత్ర్యం తెచ్చిందన్నారు.మూడు విడుతల్లో 31 వేల కోట్లతో రైతులకు రుణ విముక్తి చేశామన్నారు రేవంత్. దీంతో తామ ఇచ్చిన మాట ప్రకారం ఆగస్ట్ 15 లోగా రైతుల రుణమాఫీని సంపూర్ణంగా చేశామని అన్నారు. దీంతో అసెంబ్లీ సవాల్ చేసిన విధంగా హరీశ్ రాజీనామా చేస్తే సిద్ధిపేటకు పట్టిన పీడ విరగడ అవుతుందని ధ్వజమెత్తారు. ఒకవేళ రాజీనామా చెయ్యకపోతే అమరుల స్థూపం దగ్గర హరీష్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు సీఎం రేవంత్. బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం జిల్లా రైతులకు బేడీలు వేసి జైల్లో పెట్టిందన్నారు రేవంత్ రెడ్డి. కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అంటుండు..ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు గుండు సున్నా వచ్చినా కేటీఆర్, కేసీఆర్ కు బుద్ధి రావడం లేదన్నారు. ప్రజలే తప్పు చేశారన్నట్టుగా కేటీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ బతుకు బస్టాండ్ అయ్యిందని ధ్వజమెత్తారు. ఖమ్మం గడ్డ ..కాంగ్రెస్ అడ్డా అని రేవంత్ రెడ్డి అన్నారు. 8 నెలల్లోపే రూ.2 లక్షల రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. కాగా, 2026 కల్లా సీతారామ పూర్తి చేస్తామని, ఎన్ని నిధులు అవసరమైనా తెస్తామన్నారు రేవంత్.

# కెటిఆర్‌కు మంత్రి సీతక్క కౌంటర్




హైదరాబాద్: మహిళలకు ఉచితబస్సుల ప్రయాణంపై కెటిఆర్, తనదైన శైలిలో వ్యంగ్రాస్త్రాలు సంధించారు. బస్సుల్లో అల్లం వెల్లుల్లి, కుట్లు అల్లికలు చేసుకుంటే తప్పేంటన్న మంత్రి సీతక్క వ్యాఖ్యలపై కెటిఆర్ విమర్శలు గుప్పించారు.బస్సుల్లో అల్లం వెల్లుల్లి, కుట్లు అల్లికలు తాము వద్దనట్లేదని పేర్కొన్నారు. బస్సుల్లో కుట్లు అల్లికలే కాదు, అవసరమైతే బ్రేకు డ్యాన్సులు వేసుకోవచ్చని తెలిపారు. బస్సుల్లో సీట్ల కోసం మహిళలు కొట్టుకుంటున్నారని, డ్రైవర్లు కండక్టర్లకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బస్సులు ఎక్కువ పెట్టండి, అవసరమైతే ఒక్కొక్కరికి ఒక్కో బస్సు పెట్టండంటూ ప్రభుత్వంనుద్దేశించి వ్యాఖ్యనించారు.

**తెలంగాణ మహిళా లోకానికి కెటిఆర్ క్షమాపణ చెప్పాలి : మంత్రి సీతక్క**

ఆర్‌టిసి బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్స్‌లు, రికార్డింగ్ డాన్స్‌లు చేసుకోవచ్చని కెటిఆర్ అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడారని మంత్రి సీతక్క మండిపడ్డారు. మీ తండ్రి కెసిఆర్ మీకు నేర్పిన గౌరవం, సంస్కారం ఇదేనా కెటిఆర్..? మీ ఆడపడుచులు అంతా బ్రేక్ డాన్స్‌లు చేస్తున్నారా..? అని అని ప్రశ్నించారు. ఆడవాళ్ళంటే కెటిఆర్ గౌరవం లేదని అన్నారు. మహిళల పట్ల కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం అని, భేషరతుగా కెటిఆర్ తెలంగాణ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆడవాళ్ళను కించపరిచే విధంగా బ్రేక్ డాన్సులు చేసుకోండి అనడం మీ బుర్రలో ఉన్న బురదకు నిదర్శనమని విమర్శించారు. గత పది సంవత్సరాలు హైదరాబాద్‌లో క్లబ్బులు, పబ్బులు, బ్రేక్ డాన్సులు ఎంకరేజ్ చేసిన చరిత్ర మీది అని కెటిఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని మహిళల కోసం సంక్షేమ పథకాలను అమలుపరుస్తున్నామని, అందులో భాగంగా పేద మహిళలకు రవాణా భారాన్ని తగ్గించేందుకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. శ్రమ జీవులు, శ్రామిక మహిళలు ప్రయాణ సమయంలో సమయం వృధా చేయకుండా ఏదో పని చేసుకుంటే తప్పేంటి..? అని కెటిఆర్‌పై సీతక్క ప్రశ్నల వర్షం కురిపించారు.


## అస్సాంవ్యాప్తంగా 24

# బాంబులు అమర్చాం



గువాహటి: అస్సాం వ్యాప్తంగా 24 ప్రదేశాలలో బాంబులు అమర్చినట్లు నిషిద్ధ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం(ఉల్ఫా)(ఇండిపెండెంట్) గురువారం చేసిన హెచ్చరికతో అప్రమత్తమైన భద్రతా దళాలు పేలుడు పదార్థాల కోసం విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ఉల్ఫా వెల్లడించిన అన్ని ప్రదేశాలకు బాంబు డిస్పోజల్ స్కాడ్లు తరలి వెళ్లాయని, అయితే ఇప్పటి వరకు ఎక్కడా బాంబు కాని పేలుడు పదార్థం కాని లభించినట్లు తెలియరాలేదని ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అయితే..సాంకేతిక వైఫల్యం కారణంగా బాంబులు పేలలేదని మీడియా సంస్థలకు పంపిన ఇమెయిల్‌లో ఉల్ఫా తెలిపింది. 19 బాంబులు అమర్చిన ప్రదేశాల జాబితాను పంపిన ఉల్ఫా మిగిలిన ఐదు ప్రదేశాలను వెల్లడించలేదు. బాంబులను నిర్వీర్యం చేయడంలో ప్రజలు సహకరించాలని ఉల్ఫా కోరింది. అయితే..దీనిపై ఒక సీనియర్ పోలీసు అధికారి స్పందిస్తూ శాంతి చర్చలను వ్యతిరేకిస్తున్న ఉల్ఫాలోని ఒక వర్గం ప్రస్తావించిన ప్రదేశాల జాబితాను అన్ని జిల్లాల ఎస్పీలకు పంపామని, ఆయా ప్రదేశాలలో క్షుణ్ణంగా తనిఖీలు జరపాలని కోరామని చెప్పారు. ప్రతి ప్రదేశానికి బాంబు డిస్పోజల్ స్కాడ్‌లు, మెటల్ డిటెక్టర్లు, స్నిఫర్ డాగ్స్‌ను పంపినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు బాంబుల లభ్యతకు సంబంధించి సమాచారం లేదని ఆయన తెలిపారు. అయితే తమకు బాంబు లాంటి పదార్థం లభించినట్లు నాగావ్, లఖింపూర్, శివసాగర్‌కు చెందిన స్థానిక పోలీసు అధికారులు తెలిపారు. ఉల్ఫా పేర్కొన్న 24 ప్రదేశాలలో 8 గువాహటిలోనే ఉన్నాయి. వీటిలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, మంత్రుల అధికారిక నివాసాలు ఉన్న డిస్పూర్‌లోని లాస్ట్ గేట్‌లోని ఖాళీ స్థలం కూడా ఉంది.


# స్కిల్ వర్శిటీ ఛైర్మన్ గా ఆనంద్ మహీంద్రా



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్‌గా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. ప్రముఖ విద్యా వేత్త శ్రీనివాస సి.రాజు ఈ యూనివర్సిటీకి బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సభ్యుడిగా, కో-చైర్మన్ హోదాలో నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాష్ట్ర యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. 17 రకాల కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

# స్వాతంత్ర్య వేడుకల్లో రాహుల్ సీటుపై చర్చ



న్యూఢిల్లీ: ఎర్రకోటలో 78 వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి సీటు కేటాయింపు చర్చకు దారి తీసింది. ప్రోటోకాల్ ప్రకారం లోక్‌సభలో ప్రతిపక్షనేత, క్యాబినెట్ మంత్రులకు సమానంగా ముందు వరుసలో సీట్లు కేటాయిస్తారు. ముందు వరుసలో చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్, అమిత్‌షా, ఎస్. జైశంకర్ కూర్చున్నారు. మొదటి వరుస అంతా ఒలింపిక్ పతక విజేతలు మనుభాస్కర్, సరబ్‌జోత్ సింగ్, ఒలింపిక్ కాంస్య విజేతలైన హాకీ జట్టు, ఆ జట్టు కెప్టెన్ హర్‌మన్‌ప్రీత్ సింగ్, పిఆర్‌శ్రేజేష్, తదితరులు రాహుల్ కన్నా ముందు వరుసలో కూర్చున్నారు.

తెల్లటి కుర్తా, పైజామా ధరించిన రాహుల్ భారత హాకీ జట్టు నాయకుడు గుర్జంత్ సింగ్ వెనుకన ఒలింపిక్ విజేతలతో కలిసి రెండో ఆఖరి వరుసలో కూర్చున్నారు. గత దశాబ్ద కాలంలో లోక్‌సభలో విపక్షనేత ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడులకు హాజరు కావడం ఇదే మొదటిసారి. ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై ప్రభుత్వం స్పందించింది. ఒలింపిక్ విజేతలకు ముందు వరుసలో సీట్లు కేటాయించడంతో కాంగ్రెస్ ఎంపీలకు వెనక వరుసలో సీట్లు కేటాయించినట్టు రక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు తెలిపాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించడం, ఆ మేరకు సీట్లు కేటాయించడం రక్షణ మంత్రిత్వశాఖ బాధ్యత. లోక్‌సభలో విపక్ష నేతకు సాధారణంగా ముందు వరుస లోనే సీటు కేటాయించడం ప్రోటోకాల్ ప్రకారం పరిపాటి. వాజ్‌పాయ్ ప్రధానిగా ఉన్న కాలంలో అప్పటి లోక్‌సభ విపక్ష నాయకురాలు సోనియా గాంధీకి మొదటి వరుసలోనే సీటు కేటాయించేవారు. అయితే 2014 నుంచి లోక్‌సభలో విపక్ష నేత స్థానం ఖాళీగా ఉంటోంది. ఏ పార్టీ కూడా దిగువ సభలో విపక్షనేత స్థాయిని పొందే సభ్యుల సంఖ్యను సాధించలేదు. మళ్లీ 2024 లోక్‌సభ ఎన్నికల్లోనే కాంగ్రెస్ 99 స్థానాల వరకు సంఖ్యను సాధించుకుంది. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు క్రమంగా 44, 52 స్థానాలు వచ్చాయి. మొత్తం 543 సభ్యుల లోక్‌సభలో విపక్షనేత హోదాకు తగిన బలం కాంగ్రెస్‌కు లభించలేదు.

**ఇది ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ప్రధానికి చిన్నచూపు: కాంగ్రెస్**

లోక్‌సభలో ప్రతిపక్షనాయకుడైన రాహుల్ గాంధీని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఐదో వరుసలో కూర్చోబెట్టడం ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ప్రధాని మోడీకి చిన్నచూపు ఉండడమేనని కాంగ్రెస్ మండిపడింది. పారిస్ ఒలింపిక్స్ పతక విజేతలను ప్రత్యేక అతిథులుగా గౌరవించడానికే ఈ ఏడాది ప్రాధాన్యత బట్టి సీటింగ్ విధానం నిర్ణయించడమైందని ఆయా వర్గాలు వెల్లడించడంతో కాంగ్రెస్ విమర్శల దాడి చేసింది. ప్రధాని మోడీ సంకుచిత మనస్తత్వం కలవారని, దానికి తానే రుజువు ఇస్తుంటారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే వ్యాఖ్యానించారు.

## గుడివాడలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన ఏపీ సిఎం చంద్రబాబు



**గుడివాడ:** కృష్ణా జిల్లా గుడివాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబుతోపాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. "దివంగత ఎన్టీఆర్ అడుగుజాడల్లో తమ ప్రభుత్వం పయనిస్తోంది.మాది పేదల ప్రభుత్వం. ఆర్థిక కష్టాలున్నప్పటికీ సామాజిక పింఛన్లు పెంచి అందిస్తున్నాం. పేదల ఆకలి తీర్చేందుకు నేటి నుంచి 100 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. ఈ కార్యక్రమానికి విరాళాలు ఇచ్చి ప్రజలు భాగస్వాములు కావాలి. పుట్టినరోజు, పెళ్లి రోజు, శుభకార్యాల రోజున విరాళాలు ఇస్తే మీ పేరున భోజనం పెడతాం' అని తెలిపారు. అనంతరం పేదలతో కలిసి చంద్రబాబు దంపతులు భోజనం చేశారు.

# ఇడి డైరెక్టర్‌గా రాహుల్ నవీన్



న్యూఢిల్లీ: ఫెడరల్ మనీ లాండరింగ్ నిరోధక సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తాత్కాలిక అధిపతి రాహుల్ నవీన్ సంస్థ పూర్తి కాలపు డైరెక్టర్‌గా బుధవారం నియుక్తుడయ్యారు. క్యాబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) జారీ చేసిన ఒక ఉత్తర్వు ప్రకారం, 1993 బ్యాచ్ ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) ఆదాయపు పన్ను కేడర్ అధికారి నవీన్‌ను 'పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి రెండు సంవత్సరాల పాటు లేదా తిరిగి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు, ఏది ముందైతే అప్పటి వరకు' నియమించడమైంది. ఇడి డైరెక్టర్ కేంద్ర ప్రభుత్వంలో అదనపు కార్యదర్శి (ఎఎస్) ర్యాంక్ పదవి. నవీన్‌ను నిరుడు డిసెంబర్‌లో ఎఎస్‌గా ప్యానెల్‌లో చేర్చారు. 57 ఏళ్ల నవీన్ ప్రత్యేక డైరెక్టర్ (ఒఎస్‌డి)గా ఇడిలో 2019 నవంబర్‌లో చేరారు. సంజయ్ కుమార్ మిశ్రా నిరుడు సెప్టెంబర్ 15న పదవీ విరమణ చేసిన తరువాత నవీన్ ఇడి తాత్కాలిక డైరెక్టర్‌గా నియుక్తుడయ్యారు. మిశ్రాకు సన్నిహితునిగా పరిగణిస్తున్న నవీన్ ఇడి అధిపతిగా ఉన్నప్పుడే వేర్వేరు మనీ లాండరింగ్ కేసుల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వంటి ఉన్నత స్థాయి అరెస్టులు చోటు చేసుకున్నాయి.

## సంపాదకీయం

శుక్రవారం, ఆగస్టు 16, 2024

# పాఠశాలల్ని ఉన్నతీకరించాలి..!

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ప్రభుత్వ పాఠశాల విద్యారంగం దశను, దిశను మార్చుడానికి ప్రయత్నించడం అభినందించదగ్గ అంశం. అందులో భాగంగా గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్లు, బదిలీలు ప్రక్రియను కొనసాగించడం ద్వారా సుమారు ముప్పైవేల మంది టీచర్లకు పదోన్నతి కల్పించడం ప్రభుత్వ విద్యారంగ చరిత్రలో చారిత్రాత్మకమైనది. అందుకు ప్రత్యేకంగా కృషిచేసిన అధికార వర్గ కృషికి కృతజ్ఞతలు తెలుపవలసిందే. ఈ సందర్భంగా ఆయా ఉపాధ్యాయ సంఘాల స్వార్థ చింతన వల్ల అతీగతీ లేకుండా ఆగిపోయిన కామన్ సర్వీస్ రూల్స్ అంశం గూర్చి, అటు ప్రభుత్వ ఇటు పంచాయతీరాజ్ యాజమాన్యాల నాయకులు టీచర్లు ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్నటు వంటి సంక్షోభ స్థితిని గుర్తిస్తూ 'సొంత లాభం కొంత మానుకుని' పాఠశాలల అభ్యున్నతికి తోడ్పడవలసి ఉన్నది. ఇన్ని వేల ప్రమోషన్లు ఇచ్చినా వేలాదిమంది బదిలీలు జరిగినా పాఠశాల విద్యారంగంలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల మొత్తం విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగుతున్నది. 500కు పైగా మండల విద్యాధికారి పోస్టులు 60కి పైగా డిప్యూటీ డిఇఒ పోస్టులు, 30 దాకా జిల్లా విద్యాశాఖ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ విద్యారంగ నానాటికి పర్యవేక్షణ లేమితో కునారిల్లిపోతున్న వాస్తవాన్ని ఉపాధ్యాయ సంఘాలు గుర్తించవలసి ఉన్నది. అందుకు ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఈ ఖాళీలతో పాటు డైట్ లెక్చరర్స్, జేఎల్స్, ప్రమోషన్లకు సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాల్సి ఉన్నది. అట్లాగే పర్యవేక్షకులు లేరన్న కారణంతో పదోన్నతి పొందిన టీచర్లు తమ విద్యుక్త ధర్మాన్ని విస్మరిస్తే తాము పొందుతున్న జీతాలకు తమ బడిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందలేకపోతున్న పిల్లలకు ద్రోహం చేస్తున్నట్లే. ఇన్నివేల ప్రమోషన్స్ ఇచ్చామని ప్రభుత్వం, ప్రమోషన్లు వచ్చాయని సంతోషంలో టీచర్లు... విద్యారంగం ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను గుర్తించకపోతే విద్యార్థుల భవిష్యత్తుకు ద్రోహం చేసిన వాళ్లు అవుతారు. పదిమంది పిల్లలు లేని బడిలో కూడా ఓ ఉపాధ్యాయున్ని, 50 మంది పిల్లలు లేని హైస్కూల్లో ఓ హెడ్మాస్టర్‌ని సబ్జెక్టుకు టీచర్‌నిచ్చినా విద్యార్థుల సంఖ్య పెరగకపోవడానికి, ఉన్నతమైన ఫలితాలు రాబట్టలేకపోవడానికి కారణాలను ఈ సందర్భంగా అన్వేషించవలసి ఉన్నది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేయకపోవడం వల్ల విద్యార్థుల సంఖ్య తరిగిపోతున్నదని వాపోయిన ఉపాధ్యాయ సంఘాలు.. నేడు అన్ని పాఠశాలలు ఇంగ్లీష్ మీడియంగా మారినప్పటికీ ఇవ్వాళ గత సంవత్సరాల కంటే భిన్నంగా విద్యార్థుల సంఖ్య తగ్గటానికి తగిన కారణాలను అన్వేషించవలసి ఉన్నది. ఇటీవల అసర్ నివేదిక ప్రకటించినట్లుగా కనీసం 8వ తరగతి విద్యార్థులు ఐదవ తరగతికి, ఐదవ తరగతి విద్యార్థులు రెండవ తరగతికి సంబంధించిన కనీస సామర్థ్యాలను పొందలేకపోతున్నారని ప్రకటించింది. గతంలో జరిగిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కూడా విద్యార్థుల కనీస సామర్థ్యాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేయలేదు. పదేళ్ల తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో 27వ స్థానంలో ఉందని నివేదికలు ప్రకటించడం ఆందోళన కొలిపే అంశం.

ఇందుకు టీచర్లను నిందించడం ఒక కారణం అయితే, ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాలు మరొక కారణమని స్పష్టమవుతున్నది. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గటానికి పాఠశాల మీద పర్యవేక్షణ లేమితో పాటు, ఒక్క టీచరు నాలుగైదు తరగతులు బోధించలేని స్థితి, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కనీస వసతులలేమి, కనీసం బ్లాక్ బోర్డ్‌కు నల్ల రంగు వేయించలేని, గోడలకు తెల్ల సున్నాలు కొట్టలేని దుర్గతిలో పాడుబడ్డ భవనాల్లా ప్రభుత్వ బడులు ఉండటం ఒక కారణం. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన అంగన్వాడీ కేంద్రాలు కేవలం పిండి బడులుగా పాఠశాలకు దూరంగా కొనసాగడం, వాటిని స్థానిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రాథమిక విద్యను పరిపుష్టం చేయవలసి ఉన్నది. అరకొరగా ఇవి ఉన్నచోట కూడా విద్యార్థుల సంఖ్య లేకపోవడానికి మండల కేంద్రాల నుండి ఊర్లలోకి వచ్చే ప్రైవేటు పాఠశాలల బస్సులు పిల్లల్ని గద్దల్లా ఎత్తుకెళ్లడం కొనసాగుతున్నది. ఇందుకు పరిష్కారంగా ప్రైవేటు పాఠశాలలను నియంత్రించడం, ఏ గ్రామంలోని పిల్లలు ఆ గ్రామంలో చదువుకోవడానికి ప్రైవేటు బస్సులు, బడులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. గతంలో మన ఊరు- మనబడి పేర ఎంపికైన పాఠశాలలకు నిధులు కేటాయించి అమ్మ ఆదర్శ పాఠశాలలతో పాటుగా వాటిని ప్రభుత్వం ఆలోచిస్తున్న సెమీ రెసిడెన్షియల్‌గా మార్చవలసి ఉన్నది. అందుకు కొనసాగింపుగా బడికి వచ్చే పిల్లలకు ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం మంచి భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వడం గూర్చి ఆలోచించాలి. గతంలో నెలకొల్పిన మోడల్ స్కూల్స్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు విద్యారంగాన్ని మరోవైపు నెట్టివేశాయి. అట్లాంటి ప్రయత్నమే 25 ఎకరాలలో అన్ని హంగులతో ప్రభుత్వం నెలకొల్పుతున్నట్లు చెబుతున్న బడులకంటే ఇప్పటికే ఉన్న పాఠశాలలను అన్ని హంగులతో బలోపేతం చేయడం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

# పాఠశాలకు కంప్యూటర్, పోడియం అందజేసిన పూర్వ విద్యార్థులు



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, గన్నేరువరం:** గన్నేరువరం, ఆగస్టు 15, గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న 1998 -99 బ్యాచ్ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఇటీవల కలుసుకొని సిల్వర్ జూబ్లీ వేడుకను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారందరూ చదువుకున్న పాఠశాలకు 40 వేల విలువ గల కంప్యూటర్, పోడియం, కార్పెట్లను గురువారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామయ్యకు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఐలయ్య, అంజయ్య, రమేష్, లక్ష్మణ్, ప్రభాకర్, రాము, ధీమంత్, శేఖర్, సునంద్, నరసింహారెడ్డి,మల్లారెడ్డి, మధు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దూరు పాఠశాలకు ఆటోమేటిక్ టైమర్ స్కూల్ బెల్ వితరణ



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్ సిరిసిల్ల:** పెద్దూరు పాఠశాలకు పది వేల రూపాయల విలువ గల రూపాయల విలువైన ఆటోమేటిక్ టైమర్ స్కూల్ బెల్ ని మంగ ప్రశాంత్ బుధవారం రోజున పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవికి అందించారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని,సమయము యొక్క విలువను గుర్తించాలనే సందేశాన్ని ఇచ్చే ఈ బెల్ ని బహుకరించడం పట్ల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, బైరి వాణిశ్రీ, కదర్ల కల్పన, ఉత్తమ్ విజయ్ కుమార్,నాగుల వీణ, గడ్డి మహేశ్, తమ్మటి జీవన్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### జెండాను ఆవిష్కరించిన అధ్యక్షుడు యం శంకర్



**నర్వ ఆగష్టు 15:**
నారాయణపేట జిల్లానర్వ మండల పరిధిలోని రాయికోడు గ్రామ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం గ్రామ అధ్యక్షుడు మల్లం కోటి శంకర్ అధ్యక్షతన గ్రామ పెద్దలు, యువకులు,అంబేద్కర్ యూత్ సహకారంతో గురువారం 78వ స్వతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూజా నిర్వహించారు.అనంతరం అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మల్లన్ కోటి శంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జాతీయగీతం,వందేమాతరం ఆలపించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆంజనేయులు గౌడ్, కేవన్ స్వామి, ఎం నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ సుశీల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ తాయప్ప గౌడ్,మల్లేష్ యాదవ్, ఎం సత్య రెడ్డి,అబ్దుల్ ఘని, జబ్బర్, ఎన్ వెంకటేష్,పి ఆనంద్, బుడ్డ ఎల్లప్ప, చిన్న మాసన్న,డ్రైవర్ చెన్నప్ప,నౌసు వెంకటయ్య, ఏసేపు, యువకులు జి భీమేష్, కే అశోక్, రామాంజనేయులు,షఫియోద్దీన్, శివశంకర్, రమేష్, నారి, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ గ్రామ పంచాయతీగా అడ్డాకుల అవార్డు అందుకున్న ప్రభుత్వ అధికారులు

### - స్వతంత్ర దినోత్సవం సందర్భంగా మంత్రిని జూపల్లి కృష్ణారావు జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ప్రత్యేక అధికారులు

**ఆగస్టు 15, అడ్డాకుల:** తెలంగాణ ప్రభుత్వ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం ఐదవ తారీకు నుండి 9వ తారీకు వరకు నిర్వహించిన కార్యక్రమం లో.. భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు అడ్డాకుల గ్రామపంచాయతీకి ఉత్తమ గ్రామ పంచాయతీ గా ప్రశంసాపత్రం రావడం హర్షనీయం. ఈ అవార్డును 78 వ, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భం గా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి, జిల్లా ఎస్పీ జానకి చేతుల మీదుగా గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి మదన్మోహన్ గౌడ్( తహసిల్దార్), ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీఓ విజయ్ కుమార్ యాదవ్ అడ్డాకుల గ్రామ పంచాయతీ కార్యదర్శి సరస్వతి అందుకోవడం జరిగింది . ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి తహసిల్దార్ మదన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ వారం రోజులు జరిగిన స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసుకున్నామని అన్నారు. ఆ కృషికి ఫలితంగానే బెస్ట్ గ్రామపంచాయతీగా అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది అన్నారు ముఖ్యంగా వారం రోజులు గ్రామపంచాయతీ కార్యదర్శి సరస్వతి కృషి పట్టుదల వల్లనే గ్రామ



పంచాయతీకి అవార్డు రావడం జరిగింది. స్వచ్ఛతనం పచ్చదనంలో జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అడ్డాకుల గ్రామపంచాయతీకి హాజరై పర్యటించి పరిశీలించడం అడ్డాకుల పురవీధుల గుండా పరిశుభ్రత పల్లె ప్రకృతి వనం పార్కు పచ్చదనం పేరుతో వేసిన చెట్లు వీటన్నిటిని శుభ్రపరచి శుభ్రం చేసిన భాగంలో పంచాయతీ పరిశుభ్రత కార్మికుల కృషి అధికారులకు సహకరించడం వాళ్లనే గ్రామపంచాయతీకి అవార్డు దక్కడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి సరస్వతిని ప్రశంసించారు.

# ఏ బి వి పి ఆధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు




**మద్దూర్ ఆగష్టు 15:**
నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏ బి వి పి మండల అధ్యక్షుడు అరుణ్ గౌడ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, భాస్కర్, హరీష్, నరసింహ, నరేష్, రాఘవేందర్, సాయిలు, భరత్ గ్రామ ప్రజలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ముంబై మలాడ్ లో ఘనంగా పంద్రాగస్టు

78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తూర్పు మలాడ్ గోవింద్ నగర్లో గల విశాలాంధ్ర సంఘం ఆవరణలో సంఘ సభ్యులు ఆర్గ్ నైజింగ్ సెక్రటరీ ముత్తాబత్తుల ధర్మారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జాతీయ గీతం ఆలపించారు. అనంతరం సంఘం హాలులో జరిగిన సభకు సంఘం అధ్యక్షులు సరేళ్ళ బాబు సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షుడిగా గోగి కేశవరావు సభా కార్యక్రమం కొనసాగించారు. సంఘం మాజీ సలహాదారులు గెడ్డం పోలు, సలహాదారులు ప్రకాష్ స్వామి, ఉపాధ్యక్షులు ముత్తాబత్తుల రాంబాబు, ప్రధాన కార్యదర్శి గిడ్ల రాజేంద్ర ప్రసాద్, నాగాబత్తుల వెంకటేశ్వరరావు, కోషాధికారి మామిడిశెట్టి మధుబాబు, నాగాబత్తుల బాలకృష్ణ తదితరులు స్వతంత్ర దినోత్సవ చరిత్ర విశిష్టతలను సవిస్తారంగా వివరించారు. దేశానికి విధేయులుగా ఉండాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తదుపరి సంఘం సలహాదారులు ప్రకాశ్ స్వామి సభకు హాజరైన విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. పంద్రాగస్టు ఉత్సవంలో భాగంగా చాక్లెట్లు అల్పాహారం పంచడం జరగింది. చివర్లో సంఘం ఉప కార్యదర్శి వందన సమర్పణ చేశారు

# వాడవాడలా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా



**నర్వ ఆగష్టు 15:**
78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం నర్వ మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోనూ మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. మండలంలోని ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు.అన్ని పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాల్లోనూ జెండాను ఎగురవేశారు.ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో శ్రీనివాసులు,తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మల్లారెడ్డి,పిఎసిఎస్ లో చైర్మన్ శ్రీనివాసరెడ్డి,పోలీస్ స్టేషన్లో ఎస్సై కురుమయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ,ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వేణుగోపాల్ రెడ్డి, ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ అధికారులు, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ప్రత్యేక అధికారులు, ప్రైవేటు పాఠశాలలు ప్రతిభ హై స్కూల్ వద్ద కరస్పాండెంట్ హనుమంత్ రెడ్డి, ఎస్ వి ఎం వద్ద సత్యనారాయణ లు మువ్వన్నెల జెండా ను ఎగురవేశారు.పాఠశాలలో చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు.అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసి మిఠాయిలను అందజేశారు.

# పాతర్చేడ్ లో ఉచిత బస్సు పాసుల పంపిణీ

### -80 మందికి అందజేత



**నర్వ ఆగష్టు 15:**
నారాయణ పేట జిల్లా నర్వ మండల పరిధిలోని పాతర్చేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత ఆర్టీసీ బస్సు పాసులను రాయికోడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు.ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సు సర్వీసును అందించడం జరుగుతుంది.ఇందులో భాగంగా బాయ్స్ కు కూడా ఏడాది పాటు ఉచితంగా ప్రయాణించే విధంగా వీళ్ళు కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు తల కొంత డబ్బును షేర్ చేసుకొని ప్రభుత్వానికి చెల్లించి ఉచితంగా విద్యార్థులకు ఉచితపాసులను అందించడం జరిగిందని నాయకులు మల్లేష్,తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు జబ్బార్,తాయప్ప, సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇక ఇంటి స్థలాలకు పాస్ బుక్స్



వరంగల్ : ధరణి స్థానంలో భూమాతను తీసుకొవస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ల్యాండ్ కమిషన్ వేస్తామని, ప్రభుత్వ భూములు, పౌరుల హక్కులను కాపాడేందుకు రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. అందులో భాగంగానే రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులపై హక్కులను నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఆర్ ఓ ఆర్ చట్టాన్ని తీసుకురానుంది. ఈ మేరకు 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్-2024' పేరుతో రూపొందించిన ముసాయిదా బిల్లును ప్రజల ముందుకు తీసుకొచ్చింది. భూ హక్కుల రికార్డులను ఎప్పటికప్పుడు సవరించడం, ఇప్పటివరకు పాసుబుక్‌లు రాని భూముల సమస్యలను పరిష్కరించడం, సర్వే చేసి కొత్తగా భూహక్కుల రికార్డు తయారు చేసుకునే అధికారాన్ని కల్పించడంతో పాటు రైతులకు మేలు చేసేలా ఈ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించింది. దీంతోపాటు రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూ ఆధార్, ఆబాదీలకు ప్రత్యేక హక్కుల రికార్డు, అప్పీల్, రివిజన్ వంటి సెక్షన్‌లను ముసాయిదా బిల్లులో ప్రతిపాదిం చింది. దీనిపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్నాక కొత్త ఆర్‌ఓఆర్ చట్టం అమల్లోకి తీసుకురానుంది. కొత్త ఆర్‌ఓఆర్ చట్టాన్ని 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేయడంతో పాటు పాత నాలుగు ఆర్‌ఓఆర్ చట్టాలను క్రోడీకరించి ఈ ముసాయిదాను తయారు చేశారు. అందులో భాగంగా 18 రకాలుగా భూమి మీద రైతులకు హక్కులు కల్పించవచ్చని ఈ ముసాయిదాలో పేర్కొన్నారు. ఈ ముసాయిదా రూపకల్పనలో భూచట్టాల నిపుణుడు ఎం. సునీల్ కుమార్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సిఎంఆర్వో పిడి వి. లచ్చిరెడ్డిలు కీలకపాత్ర పోషించారు. 2020కి ముందు ఉన్న రెవెన్యూ చట్టాలు, కొత్తగా రానున్న 'ది తెలంగాణ రికార్డ్ ఆఫ్ రైట్స్-2024'ల మధ్య తేడాలను ఆయన తెలియచేశారు. రికార్డ్ ఆఫ్ రైట్స్ -2024 చట్టం' ముసాయిదా బిల్లు రూపకల్పన కోసం అధికారులు, రెవెన్యూ నిపుణులు విస్తృతస్థాయిలో కసరత్తు చేశాం. తెలంగాణలో ఇప్పటివరకు అమలైన 1936, 1948, 1971, 2020 నాటి చట్టాలను పరిశీలించి వాటి అమల్లో వచ్చిన ఫలితాలను బేరీజు వేసి ఈ కొత్త చట్టాన్ని రూపొందించాం. తెలంగాణలో ఆర్‌ఓఆర్ చట్టాల అమలు చరిత్ర, ప్రస్తుత సమస్యలు, రాబోయే అవసరాలను అంచనా వేసి పలు సెక్షన్‌లతో ఈ ముసాయిదాను సిద్ధం చేశాం. ఈ క్రమంలోనే 18 రాష్ట్రాల్లోని ఆర్‌ఓఆర్ చట్టాలను పరిశీలించడంతో పాటు బీహార్ అమల్లో ఉన్న మ్యుటేషన్ చట్టాన్ని కూడా అధ్యయనం చేశాం. భూములకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య (భూదార్), గ్రామీణ ప్రాంత ఆస్తుల రికార్డు తయారు చేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన వెసులుబాటును ఇందులో కల్పించనున్నాం. భూమి హక్కుల బదలాయింపు కోసం 18 రకాల పద్ధతులు గుర్తించి ఈ ముసాయిదాలో ప్రస్తావించాం. ఏరకంగా హక్కుల బదలాయింపు జరిగినా 'రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్‌ఓఆర్)లో నమోదు చేయాలని సూచించాం. రిజిస్టర్ దస్తావేజులు, వారసత్వం, భాగ పంపకాల ద్వారా హక్కుల బదలాయింపునకు పాత చట్టంలోని నిబంధనను ఇందులో కొనసాగించాం. ఈ పద్ధతుల్లో తహసీల్దార్ రిజిస్టేషన్, మ్యుటేషన్ చేస్తారు. అయితే మ్యుటేషన్ చేసే సమయంలో విచారణ జరిపే వెసులుబాటును ఈ చట్టంలో పొందుపరిచాం. ఆ విచారణలో తప్పులేమైనా గుర్తిస్తే ఆయా కారణాలను వివరిస్తూ మ్యుటేషన్ ని అధికారం తహసీల్దార్‌కు కల్పించాం. రిజిస్టర్డ్ దస్తావేజులు, భాగ పంపకాలు, వారసత్వ హక్కుల మ్యుటేషన్‌ను విచారించే అధికారం తహసీల్దార్‌లకు, మిగతా అంశాలకు సంబంధించి ఆర్డీఓకు అధికారం కల్పించాం. తహసీల్దార్లు, ఆర్డీఓలు చేసే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లకు సంబంధించి వివాదాలు వస్తే అప్పీల్, రివిజన్‌లకు కొత్త చట్టం అవకాశం ఇవ్వనుంది. మొదటగా కలెక్టర్లు లేదా అడిషనల్ కలెక్టర్ల, అక్కడ పరిష్కారం కాకపోతే సిసిఎల్ఏకు అప్పీల్ చేసుకునేలా ఈ ముసాయిదాలో సూచించాం. రివిజన్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వం లేదా సిసిఎల్ఎ మాత్రమే చేయాలని బిల్లులో పొందుపరిచాం. గతంలో జాయింట్ కలెక్టర్లకు ఉన్న రివిజన్ అధికారాలను ఇప్పుడు సిసిఎల్ఎకు కల్పించాం. ఏదైనా రికార్డులో తప్పు జరిగిందని భావిస్తే సుమోటోగా తీసుకొని కూడా పరిష్కరించవచ్చు. అయితే అడిషనల్ కలెక్టర్ స్థాయి నుంచి ప్రభుత్వం వరకు అప్పీల్ లేదా రివిజన్‌లలో ఏ నిర్ణయం తీసుకున్నా లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వడాన్ని తప్పనిసరి చేశాం. 2020 చట్టంలో ఈ అంశం లేదని కొత్త చట్టం అమల్లోకి వస్తే భూమి హక్కుల రికార్డుల వివాదాలన్నీ అప్పీలు, రివిజన్‌లతోనే పరిష్కారమవుతాయి. యాజమాన్య హక్కుల వివాదాలు, భాగపంపకాల విషయంలో వివాదాలున్నప్పుడు మాత్రమే కోర్టులకు వెళ్లాల్సి ఉంటుంది.

# కేసీఆర్ వ్యూహం ఏమిటో



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర చాలా కీలకం? పదేళ్ల పాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్? గత ఎన్నికల్లో ఓటమి తర్వాత కేవలం పార్టీ కార్యక్రమాలకు? తన ఫాం హౌస్‌కు మాత్రమే పరిమితమయ్యారనే వాదన ఉంది. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు అస్సలు హాజరుకావడం లేదు. ప్రస్తుత సభ కొలువుదీరిన తర్వాత ఈ 8 నెలల కాలంలో కేవలం రెండు సార్లు మాత్రమే శాసనసభలో అడుగుపెట్టారు కేసీఆర్. అందులోనూ ఒకసారి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయడానికి అసెంబ్లీకి రాగా, గత వారం జరిగిన బడ్జెట్ సమావేశాలకు మరోసారి వచ్చారు కేసీఆర్. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రాకపోవడంపై పొలిటికల్ సర్కిల్స్‌లో రకరకాల ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు పదేపదే కేసీఆర్‌ను సభకు రప్పించాలని కవ్వించేలా విమర్శలు చేస్తున్నా.. ఆయన మాత్రం చలించలేదు. మరోవైపు కేసీఆర్ సభకు రావాల్సిన పని లేదని, ఆయన బదులుగా తాము సరిపోతామని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చెప్పుకుంటూ వస్తున్నారు. ఐతే తాను అసెంబ్లీలో అడుగుపెట్టకపోవడానికి కారణమేంటనేది ఇంతవరకు ఎక్కడా చెప్పలేదు కేసీఆర్. ఇక తాజాగా ఆయనను కలిసిన బీఆర్ఎస్ సభ్యుల వద్ద తాను అసెంబ్లీకి హాజరుకాకపోవడానికి అసలు కారణమేంటన్నది చెప్పారట. తాను పూర్తిగా అసెంబ్లీని బహిష్కరించలేదని? త్వరలోనే మళ్లీ అసెంబ్లీలో అడుగుపెడతానని తనను కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వివరించారట మాజీ సీఎం కేసీఆర్?. పదేళ్లు సీఎంగా పనిచేసిన తనను అవమానించేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని ఆరోపిస్తున్న కేసీఆర్?. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు తీరును బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వద్ద ప్రస్తావించారని అంటున్నారు. అధికారంలోకి రాడానికి ఎన్నో హామీలిచ్చిన కాంగ్రెస్? చేతులెత్తేస్తోందని? ఆ విషయంలో ప్రజల దృష్టిని మళ్లించేందుకు తనను టార్గెట్‌గా విమర్శలు చేస్తుందని వివరించారట కేసీఆర్. కాంగ్రెస్ గ్యారెంటీ హామీలపై ప్రజల్లోనే తేల్చుకోవాలనే ఆలోచనతో తాను పక్కా వ్యూహం సిద్ధం చేశానని? తన వ్యూహం ప్రకారం పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని? ఆ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగితే ప్రజల్లోనే తేల్చుకునే అవకాశం వస్తుందని చెప్పారట కేసీఆర్. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అధికార పక్షంతో బాగా పోరాడారని తనను కలిసిన ఎమ్మెల్యేలను అభినందించిన కేసీఆర్? సీఎం రేవంత్‌రెడ్డితో తాడోపేడో అన్నట్లు తలపడిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడినట్లు చెబుతున్నారు. తనను పదే పదే సభకు రావాలంటూ రేవంత్ పిలవడం వెనుక వ్యూహాన్ని కూడా సదరు ఎమ్మెల్యేలకు కేసీఆర్ వివరించారట. తాను సభకు వస్తే టార్గెట్ చేసి విమర్శలు చేయడమో లేదా తనతో వాగ్వాదానికి దిగడం ద్వారానో ప్రజల్లో తన ఇమేజీని తగ్గించడమే రేవంత్ వ్యూహమని తేల్చారట కేసీఆర్. ఓ వైపు తనను సభకు రావాలని కోరుతూనే? మరో వైపు హాఫ్, ఫుల్ అంటూ రేవంత్ మాట్లాడ్డం ఏంటని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారంటున్నారు. మరోవైపు పార్టీ మారిన ఎమ్మెల్యేలతోనే బూతులు మాట్లాడించడం రేవంత్ వ్యూహంలో భాగమేనని.. దీనికి దీటుగా స్పందించిన ఎమ్మెల్యేలను ఆయన అభినందించినట్లు తెలుస్తోంది. ఇక ఈ సందర్భంగానే రాష్ట్రంలో ఉప ఎన్నికల ప్రస్తావన వచ్చిందని చెబుతున్నారు. ఉప ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మారతాయని? ఆ తర్వాత తాను అసెంబ్లీకి వస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో చెప్పారట కేసీఆర్. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలపై ఎట్టిపరిస్థితుల్లో అనర్హత వేటు పడుతుందని అంచనా వేస్తున్న బీఆర్ఎస్ బాస్? ఈ విషయంలో నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ ఆలస్యం చేస్తే సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఈ తరహా కేసులపై ఆయా రాష్ట్రాలకు కొన్ని సూచనలు చేసిందని? ఆ ప్రకారం కనీసం మూడు నెలల్లోగా ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఆ స్థానాలకు జరిగే ఉప ఎన్నికల్లో ప్రభుత్వంతో చావోరేవో తేల్చుకుంటానని? ఆ తర్వాతే సభకు వస్తానని ఎమ్మెల్యేలకు చెప్పారట బీఆర్ఎస్ బాస్. మొత్తానికి తాను సభలో అడుగుపెట్టాలంటే భారీ విజయం సాధించి?. ప్రజల్లో తన పట్టు సడలలేదని నిరూపించుకోవాలని కేసీఆర్ డిసైడయ్యారని అంటున్నారు పరిశీలకులు.

# జీఎస్టీ తలనొప్పి

హైదరాబాద్ : తెలంగాణ సర్కారులో ఓ ఐఏఎస్ తీరు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి లాభం చేస్తున్నాననే ఆలోచనతో దూకుడు చూపిన ఆ ఐఏఎస్ వల్ల ప్రభుత్వానికి కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్న సామెతలా రాష్ట్ర ప్రభుత్వమే చుక్కలు లెక్కిస్తోందట. ఏదో అనుకుంటే ఇంకేదో అవ్వడంతో ఆ ఐఏఎస్ కూడా అయ్యా ఎస్ అనాల్సి వస్తోందంటున్నారు. తెలంగాణలో వాణిజ్య పన్నుల శాఖ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వానికి సమస్యగా మారింది. రాష్ట్రానికి చెందిన కొన్ని సంస్థలు 1400 కోట్ల రూపాయలకుపైగా జీఎస్టీ ఎగవేతకు పాల్పడ్డినట్లు వాణిజ్యశాఖ అనుమానం వ్యక్తం చేసింది. మొత్తం 11 సంస్థలు ఎగవేతకు పాల్పడినట్లు కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ టీకే శ్రీదేవి గుర్తించారు. దీంతో జాయింట్ కమిషనర్ రవితో సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయించారు. దాదాపు 1400 కోట్ల పన్ను ఎగవేత అనగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటనే యాక్షన్‌లోకి దిగింది. సీఐడీకి కేసును అప్పగించింది. సీఐడీ అసలు బాగోతాన్ని తేల్చే పనిలో పడింది. మాజీ సీఎస్ సోమేశ్ కుమార్, రాష్ట్ర జీఎస్టీ అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వర రావు, జాయింట్ కమిషనర్ శివరాం ప్రసాద్, హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ శోభన్ బాబు లపై కేసు నమోదు చేసింది సీఐడీ. ఇలా ఈ కేసుపై సీఐడీ కూపీ లాగుతుండగానే సెంట్రల్ జీఎస్టీ ఎంట్రీ ఇచ్చింది. ఎగవేత మొత్తంలో సగం తమకు రావాలని.. పన్ను ఎగవేతదారుల పేర్లు ఇవ్వాలని లేఖ రాసింది. ఇక్కడే అసలు ట్విస్టు బయటపడటంతో ప్రభుత్వ పెద్దలు? అధికారులు తలలు పట్టుకుంటున్నారు. భారీ మొత్తంలో పన్ను ఎగవేశారని ఫిర్యాదు చేసిన జాయింట్ కమిషనర్ రవిని సీఐడీ విచారించగా, తన వద్ద ఆధారాలు ఏమీ లేవని ఆయన చెప్పడంతో పోలీసులు కంగుతిన్నారంటున్నారు. తనకు అప్పటి కమిషనర్ శ్రీదేవి చెబితేనే ఫిర్యాదు చేశానని.. అంతకుమించి తనకేం తెలియదని జాయింట్ కమిషనర్ చెప్పడంతో పోలీసులు అవాక్కయ్యారు. పూర్తి సమాచారం లేకుండానే కేవలం అనుమానంతో కేసు పెట్టడంపై ప్రభుత్వ పెద్దలు సైతం గుర్రుగా ఉన్నారంటున్నారు. పైగా పన్ను ఎగవేశారని ఐఏఎస్ అధికారి టీకే శ్రీదేవి




అనుమానం వ్యక్తం చేసిన సంస్థల్లో కొన్ని ప్రభుత్వ సంస్థలూ ఉండటంతో ఏం చేయాలో తేల్చుకోలేకపోతున్నారు పోలీసులు. దీనికి ఎవరిని బాధ్యులు చేయాలన్న విషయంపై పోలీసులు తర్జనభర్జన పడుతుండగా, ఐఎఎస్ అధికారి అత్యుత్సాహంతో కేంద్ర సంస్థల వద్ద బుక్కైపోయామని రాష్ట్ర అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్, ట్రాన్స్‌కో, ఎల్.ఐ.సీ, ఎన్.ఎమ్.డి.సీతో పాటు పలు సంస్థలు జీఎస్టీ ఎగవేసినట్లు కేసు పెట్టడం ప్రభుత్వానికి సైతం ఆగ్రహం తెప్పించిందంటున్నారు. దీంతో ఐఎఎస్ అధికారి శ్రీదేవిని అప్రధాన్య పోస్టుకు బదిలీ చేసింది ప్రభుత్వం. ఇదిలాఉంటే ఉరుము ఉరిమి మంగళం మీద పడిన చందంగా సెంట్రల్ జీఎస్టీ అధికారులు? రాష్ట్ర ప్రభుత్వం వెంట పడుతున్నారు. ఎగవేసిన 1400 కోట్ల రూపాయల్లో సగం కేంద్రానికి వస్తుందనే ఆలోచనతో ఎగవేతదారుల పేర్లు చెప్పాలని సెంట్రల్ జీఎస్టీ అధికారులు కోరుతున్నారట. దీంతో ఎవరి పేర్లు సూచించాలో తెలియక ప్రభుత్వం తర్జనభర్జన పడుతోందంటున్నారు. తమ వద్ద ఆధారాలు లేవంటే ప్రభుత్వం పరువు పోతుందని టెన్షన్ పడుతున్న అధికారులు? ఈ గండం నుంచి బయపడే మార్గాలను అన్వేషిస్తున్నారు.

# పని ఒత్తిడిలో పోలీస్



హైదరాబాద్ : స్టేట్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీస్ ఉద్యోగం చేయాలంటే సంబరపడే రోజులు మాయమైపోయాంటున్నారు సిటీ పోలీసులు. ఇటీవల కాలంలో పెరిగిన పని ఒత్తిడితో హైదరాబాద్ కమిషనరేట్‌లో పని చేసేందుకు చాలా మంది వెనకడుగు వేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఇటీవల సిటీ పోలీసింగ్‌లో వచ్చిన మార్పులతో హైదరాబాద్‌లో పోస్టింగ్ అంటేనే పోలీసులు భయపడిపోతున్నారంటున్నారు. సిటీ పోలీసింగ్ అంటే సవాళ్లతో సహవాసంగా మారుతుండమే ఎక్కువ మంది ఇంట్రెస్ట్ చూపడం లేదని చెబుతున్నారు. శాంతిభద్రతల నిర్వహణతో పాటు కేసుల దర్యాప్తు, గస్తీ విధులు, ప్రముఖుల పర్యటనల్లో బందోబస్తు, సమస్యాత్మక ప్రాంతాల్లో 24 గంటలూ డ్యూటీలు చేయాల్సి రావడంతో సిటీ పోలీసులపై పని ఒత్తిడి బాగా పెరిగిపోతోంది. దీనికి తగ్గట్టు సిబ్బందిని పెంచకపోవడం, పని చేసిన వారిని టార్గెట్ చేస్తూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో చాలామంది పోలీసులు సిటీలో విధులంటేనే జంకుతున్నారని చెబుతున్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌లో విధులంటే పోలీసులు పోటాపోటీగా ముందుకు వచ్చే వారని చెబుతున్నారు. సిటీలో పోస్టింగ్ కోసం ఎన్నో పైరవీలు చేసేవారు. కోరుకున్న పోస్టింగ్‌లకు కాసులు కూడా సమర్పించుకునే వారు. కానీ, ప్రస్తుతం పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చిందంటున్నారు. కోరుకున్న చోట పోస్టింగ్ ఇస్తామంటున్నా? ఎస్ఐలు, సీఐలు మాకొద్దు బాబోయ్ అంటూ దండం పెట్టేస్తున్నారట.. ముఖ్యంగా గత మూడేళ్ల నుంచి ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. సిబ్బంది సామర్థ్యం, స్థితిగతులను పట్టించుకోకుండా 24 గంటలూ అందుబాటులో ఉండాలంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో చాలా మంది పోలీసులు మానసికంగా కుంగిపోతున్నారని చెబుతున్నారు. నగరంలో ఏడు జోన్లు ఉండగా, కొన్నిచోట్ల తీవ్ర పని ఒత్తిడి ఉంటోందంటున్నారు. ముఖ్యంగా సెంట్రల్, వెస్ట్, సౌత్ జోన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి కింద స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. క్షణం కూడా ఖాళీ లేకుండా 24 గంటలూ డ్యూటీలు చేయాల్సి వస్తోందని ఆయా ఏరియాల్లో పని చేస్తున్న పోలీసులు వాపోతున్నారు. ఎప్పుడు? ఎక్కడ.. డ్యూటీ వేస్తారో తెలియక తీవ్రంగా సతమతమవుతున్నారని చెబుతున్నారు. వెస్ట్ జోన్‌లో వీఐపీ మూమెంట్ ఎక్కువగా ఉండడంతో ప్రతి చిన్న విషయాన్ని పైస్థాయి అధికారులు భూతద్దంలో పెట్టి చూస్తున్నారని చెబుతున్నారు. ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్ట్, డైలీ క్రైమ్ రిపోర్ట్, పెండింగ్ కేసులపై సమీక్షలు అంటూ ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచుతుండటం వల్ల క్షేత్రస్థాయి సిబ్బంది చాలా ఇబ్బందులు పడుతున్నారంటున్నారు.

# భారీగా పట్టుబడుతున్న గంజాయి

హైదరాబాద్ : హైదరాబాద్ లో భారీ స్థాయిలో గంజాయి పట్టుబడింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఎస్వోటీ (స్పెషల్ ఆపరేషన్ టీమ్) పోలీసులు ఈ గంజాయిని గుర్తించారు. దాదాపు 800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బాలానగర్ ఎస్వోటీ, శంషాబాద్ పోలీసులు కలిసి ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.94 కోట్ల విలువ ఉంటుందని పోలీసులు చెప్పారు. 800 కేజీల గంజాయి కంటెయినర్ లో ఓ వాహనం ఒడిశా నుంచి మహారాష్ట్రకు హైదరాబాద్ మీదుగా వెళ్తున్నట్లుగా విచారణలో పోలీసులు గుర్తించారు. ఈ స్థాయిలో గంజాయి తరలిస్తూ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. డీసీఎం డ్రైవర్ లు సంజీవ్ విఠల్ రెడ్డి, హోల్లప్ప, సప్లయర్ సునీల్ ఖోస్లా, జాగ సునాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దందాకు మూలకారకులైన వారి గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. అరకుకు చెందిన వ్యక్తి గంజాయి సరఫరాదారుగా ఉన్నాడని, అతని పేరు రాము అని తెలిపారు. అతను ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు చెప్పారు. ఇతను చాలా పెద్ద మొత్తంలో గంజాయిని ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటాడని పోలీసులు చెప్పారు. కమీషన్ ఏజెంట్ కం ట్రాన్స్‌పోర్టర్ గా ఒడిశాకి చెందిన సోమ్ నాథ్ ఖారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. రాము అనే వ్యక్తి గతంలో గంజాయి రవాణా చేస్తూ అరెస్ట్ అయ్యాడు. మెయిన్ పెడ్లర్ కం రిసీవర్ సురేష్ మారుతి పాటిల్ కూడా పరారీలో ఉన్నాడు. "ఇలా గంజాయి ట్రాన్స్‌పోర్ట్ చేసినందుకు ప్రతిసారి రూ.2 లక్షలు రూపాయలు తీసుకుంటారు. నిందితులు అంతా కలిసి ఎంతకాలంగా గంజాయి సప్లై చేస్తున్నారో విచారిస్తున్నాం. ప్రధాన నిందితుడు రాముతో పాటు సురేష్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు. పోలీస్ నిఘా తప్పించుకోవడానికి కంటైనర్ ముందు నిందితులు కార్ లో ఎస్కార్ట్‌గా వచ్చారు. కంటైనర్ కు రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండి ఎక్కడైనా పోలీసుల తనిఖీలు ఉంటే అప్రమత్తం చేస్తారు. పోలీసుల నిఘానుండే తప్పించుకోవడానికి టోల్గేట్ వద్దకు కంటైనర్ రాంగానే వాహనం నంబర్ ప్లేట్ మారుస్తారు. నిందితులపై అనుమానంతో 15 నుండి 25 రోజులు వరకు ఈ కేసు పై వర్కౌట్ చేసాం. నిందితులు ఒరిస్సా నుండి గంజాయి తీసుకువచ్చి పటాన్చెరువు వద్ద మరొక వెహికల్ లో గంజాయిని మారుస్తారు. మార్చిన ఆ వెహికల్ లో గంజాయిని మహారాష్ట్రకు తీసుకువెళ్తారు. విట్టల్ రెడ్డి పరవాడ సెజ్ లో సాల్వెంట్ డ్రమ్ములను కంటైనర్ లోడ్ చేసుకున్నాడు. కంటైనర్ ముందు భాగంలో సాల్వెంట్ డ్రమ్స్ పెట్టి వెనకాల భాగంలో గంజాయి ఉంచారు. కెమికల్స్ డ్రమ్ములను కూడా జిఎస్టి వేబిలు లేకుండా తరలిస్తున్నారు. ఆ కెమికల్ సాల్వెంట్స్ ఏంటి అన్న అంశంపై కూడా విచారణ చేస్తాం. మొత్తం ఏడుగురు నిందితులు గంజాయి సప్లై లో భాగంగా ఉన్నారు..ఇందులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసాం. మిగతా ముగ్గురు నిందితులను పరారీలో ఉన్నారు..వారిని వీలైనంత త్వరగా పట్టుకుంటాం" అని పోలీసులు అన్నారు.



# వక్ఫ్ చట్టంలో మార్పులు



న్యూఢిల్లీ : త్వరలో వక్ఫ్ చట్టంలో మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. బోర్డు అధికారాలను తగ్గించే ప్రయత్నం చేస్తోంది. ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఆస్తిని వక్ఫ్ బోర్డు స్వంత ఆస్తిగా పిలవడానికి తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలు బిల్లులో ప్రతిపాదించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో వక్ఫ్ చట్టంలో అనేక భారీ మార్పులు చేయనుంది. ప్రభుత్వం వచ్చే వారం పార్లమెంటులో దీని కోసం బిల్లును తీసుకురావచ్చు. అందులో అనేక సవరణలు చేయవచ్చు అని జాతీయ మీడియా కథనలు ప్రచురించాయి. దీని ప్రకారం వక్ఫ్ బోర్డు అధికారాలను తగ్గించవచ్చు. ఈ బిల్లు ప్రకారం ఏదైనా ఆస్తిని స్వంత ఆస్తిగా పిలవడానికి దాని 'నియంత్రిత' అధికారాలను తగ్గించవచ్చు, మహిళల ప్రాతినిధ్యాన్ని కూడా నిర్ధారించవచ్చు. ఈ బిల్లులో వక్ఫ్ చట్టానికి దాదాపు 40 సవరణలు ప్రతిపాదించే అవకాశం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. ఈ బిల్లుకు శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సంబంధిత వర్గాల నుంచి సమాచారం. ఈ బిల్లు చట్టంలోని కొన్ని సెక్షన్లను రద్దు చేయాలని ప్రతిపాదించింది. దీని ప్రధాన లక్ష్యం వక్ఫ్ బోర్డుల వద్ద ఉన్న ఏకపక్ష అధికారాలను తగ్గించడం. ఈ చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వం బోర్డు అధికారాలను చాలా వరకు తగ్గించాలనుకుంటోంది. బోర్డు అంతటా మరింత పారదర్శక ప్రక్రియను నిర్ధారించడానికి బిల్లు తప్పనిసరి అని కొంతమంది అంటున్నారు. మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు వక్ఫ్ బోర్డుల నిర్మాణం, పనితీరులో మార్పులు చేసేందుకు సెక్షన్ 9, సెక్షన్ 14లను సవరించవచ్చు. వివాదాలను పరిష్కరించడానికి, వక్ఫ్ బోర్డులు క్లెయిమ్ చేసిన ఆస్తులపై క్లారిటీ వచ్చేందుకు ఈ సవరణ ఉపయోగపడుతుందని కొందరు అంటున్నారు. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణలో మేజిస్ట్రేట్‌లు పాల్గొనవచ్చు. ప్రస్తుత చట్టాలను మార్చాలనే డిమాండ్ ముస్లిం మేధావులు, మహిళలు, షియాలు, బోహ్రాస్ వంటి వివిధ వర్గాల నుండి వచ్చిందని కొందరు చెప్పే మాట. దేశవ్యాప్తంగా వక్ఫ్ బోర్డుల కింద సుమారు 8 లక్షల 70 వేల ఆస్తులు ఉండగా, ఈ ఆస్తుల కింద మొత్తం భూమి దాదాపు 9 లక్షల 40 వేల ఎకరాలు ఉంది. వక్ఫ్ చట్టం 1995లో రూపొందించారు.